సాక్షి సూర్యాపేట

బుధవారం। 14। ఫిబ్రవరి। 2024



ముగ్గురి దుర్మరణం

మాడుగులపల్లి, తిప్పర్తి, తిరుమలగిరి మండలాల పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు.

- 8లో



బాసరకు పోచంపల్లి పట్టు చీరలు

సరస్వతీదేవి, లక్ష్మీదేవి, మహంకాళి అమ్మవార్లకు సమర్పించేందుకు చేనేత కళాకారులు పట్టు చీరలు తయారు చేశారు.

- 10లో



నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

చెర్వుగట్టు శ్రీపార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభంకానున్నాయి.

- 10లో

న్యూస్‌రీల్

ఇద్దరు అధికారుల బదిలీ

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : సూర్యాపేట జిల్లా ఉపాధి కల్పన అధికారి సామ మాధవ రెడ్డి నల్లగొండకు బదిలీ అయ్యారు. నల్లగొండ ఉపాధి కల్పన అధికారిగా పనిచేస్తున్న అక్బర్ సూర్యాపేటకు బదిలీ చేశారు. జిల్లా బీసీ అభివృద్ధి అధికారి(ఇన్‌చార్జి)గా విధులు నిర్వహిస్తున్న వై. మాధవరెడ్డిని రంగారెడ్డి జిల్లా ఏబీసీడీఓగా బదిలీచేశారు. రంగారెడ్డి జిల్లాలో బీసీ అభివృద్ధి అధికారి(ఇన్‌చార్జ్)గా పనిచేస్తున్న ముజాహిద్‌ఖాన్ సూర్యాపేటకు బదిలీ అయ్యారు.

ఎర్రవరం ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తాం



వెంకట్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కోదాడరూరల్ : కోదాడ మండలం ఎర్రవరంలోని శ్రీ బాల ఉగ్రలక్ష్మీనర్సింహస్వామి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందిస్తామని జిల్లా అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం ఎర్రవరంలోని ఆలయాన్ని అదనపు కలెక్టర్ దంపతులు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారిని ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ ఆలయ నిర్మాణంతో ఎర్రవరం ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోందన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నలజాల శ్రీనివాసరావు, ప్రధాన అర్చకులు ఇనుపకుతికెల లక్ష్మీనర్సింహమూర్తి పాల్గొన్నారు.

'కూరెళ్ల'కు సన్మానం

సాక్షి,యాదాద్రి : రామన్నపేట మండలం వెల్లంకిలోని ఆచార్య కూరెళ్ల గ్రంథాలయాన్ని ఈనెల 19న రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికను పద్మశ్రీ డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య మంగళవారం యాదాద్రి కలెక్టర్ హనుమంతు కే.జెండగేకు అందజేశారు. ఈ సందర్భంగా కూరెళ్ల విఠలాచార్యను అధికారులు శాలువా కప్పి సన్మానించారు.

నీళ్లతోనే బతుకు..

- ఫ్లోరైడ్‌ను పోగొట్టింది మేమే
- 80 శాతం ప్రాజెక్టులను పూర్తి చేశాం
- బహిరంగ సభలో మాజీ సీఎం కేసీఆర్ వెల్లడి
- బీఆర్ఎస్ జల పోరుకు భారీగా తరలొచ్చిన ప్రజలు
- కేసీఆర్ వేదికపైకి రాగానే దద్దరిల్లిన సభా స్థలి
- అధినేత మాట్లాడుతున్నంతసేపు ఈలలు, కేకలు



నల్లగొండ పట్టణ శివారు మర్రిగూడ బైపాస్ వద్ద నిర్వహించిన బహిరంగ సభకు హాజరైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు



అభివాదం చేస్తున్న కేసీఆర్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: 'నీళ్లు లేకపోతే మనకు బతుకు లేదు. ఉన్న నీళ్లు కూడా సరిగ్గా లేకపోతే ఇదే నల్లగొండలో ప్రజల బతుకులు ఆగమయ్యాయి. మునుగోడు, దేవరకొండలో లక్షన్నర మంది ఫ్లోరైడ్ బారినపడ్డారు' అని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. నల్లగొండలోని మర్రిగూడ బైపాస్‌లో మంగళవారం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఫ్లోరైడ్ బాధితులను ఢిల్లీ తీసుకుపోయి ప్రధాని టేబుల్‌పై పడుకోబెట్టి.. మా బతుకులు ఇలా ఉన్నాయని చెప్పినా పట్టించుకోలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాకే నల్లగొండలో ఫ్లోరైడ్‌ను రూపుమాపామని చెప్పారు. కాళ్లు, నడుములు గుంజుతుండేవని అంతకుముందు ఇక్కడి ప్రజలు చెప్పేవారని, మిషన్ భగీరథ నీళ్లు వచ్చాక ఆ బాధలు పోయాయని చెప్పారని వివరించారు.

80 శాతం పనులు పూర్తి చేశాం

ఆనాడు జల సాధన ఉద్యమంలో 45 రోజులు తిరిగి ప్రజలను చైతన్యం చేశామని కేసీఆర్ పేర్కొన్నారు. ఆ రోజు తానే పాట రాశారనన్నారు. పక్కన కృష్ణమ్మ ఉన్నా ఫలితం లేకపాయే.. అని ప్రజల ఏడ్పుపై పాట రాశానన్నారు. తరువాత గోదావరి, కృష్ణాలో బ్రహ్మాండంగా నీళ్లు తెచ్చుకునే ప్రయత్నాలు చేశామని, అవి పూర్తి కావొచ్చాయన్నారు. భువనగిరి దగ్గర బస్వాపూర్ పూర్తి కావొచ్చిందని, డిండి పూర్తి కాబోతోందన్నారు. పాలమూరు ఎత్తిపోతల కోసం దేవరకొండ ప్రజలు నోళ్లు తెరుచుకొని చూస్తున్నారని చెప్పారు. ఎవరు సహకరించకున్నా 80 శాతం పనులు పూర్తి చేశామన్నారు.

నిమిషం కూడా కరెంట్ పోకుండా చేశాం..

అందరి దీవెనలతో పదేళ్లు ఈ గడ్డను పరిపాలించానని, ఎక్కడో పోయిన కరెంటును తెచ్చి నిమిషం పాటు కూడా కరెంటు పోకుండా అందరికీ ఇచ్చామని చెప్పారు. ప్రతి ఇంట్లో నల్లా పెట్టి మంచినీళ్లు ఇచ్చామన్నారు. ఒకనాడు ఆముదాలు, బత్తాయి తోటలు మాత్రమే ఉన్న నల్లగొండలో లక్షల టన్నుల వడ్లు పండే పరిస్థితి తెచ్చామని కేసీఆర్ చెప్పారు. అంతకుముందు లేని నీళ్లు ఎక్కడి నుంచి వచ్చాయని, వాటిని తెచ్చేందుకు దమ్ము కావాలని, చేసే అర్హత ఉండాలన్నారు. నా ప్రాంతం, నా ప్రజలు అనే ఆరాటం ఉంటే ఎలాగైనా సాధించుకొని రావచ్చని అన్నారు.



సభావేదికపై నుంచి అభివాదం చేస్తున్న కేటీఆర్

12గంటల నుంచే జనాలు

మధ్యాహ్నం 12 గంటల నుంచే జనాలు సభా ప్రాంగణానికి చేరుకోవడం ప్రారంభించారు. కేసీఆర్ వచ్చే సరికి సభా ప్రాంగణమంతా నిండిపోయింది. కొందరు రోడ్లపై నిలబడ్డారు. సభలో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు కె.కేశవ రావు, మాజీ మంత్రులు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, హరీశ్‌రావు, కేటీఆర్, నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, కడియం శ్రీహరి, మహమూద్‌అలీ, పువ్వాడ అజయ్, మల్లారెడ్డి, నాయకులు నామా నాగేశ్వర్ రావు, బడుగుల లింగయ్యయాదవ్, పల్లా రాజేశ్వర్ రెడ్డి, భూపాల్‌రెడ్డి, భాస్కర్‌రావు, పైళ్ల శేఖర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, మధుసూదనాచారి, సంతోష్, గాదరి కిషోర్‌కుమార్, రమావత్ రవీంద్రకుమార్, నోముల భగత్, గొంగిడి సునిత వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.



వేదికపై నుంచి మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, చిత్రంలో కేశవరావు, కడియం శ్రీహరి, కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్, జగదీష్‌రెడ్డి, నామా నాగేశ్వర్‌రావు, పొన్నాల లక్ష్మయ్య తదితరులు

> నాడు జలసాధన ఉద్యమంలో ఇక్కడి ప్రజలను చైతన్యం చేసినం. పక్కన కృష్ణమ్మ ఉన్నా ఫలితం లేకపాయే.. అని ప్రజల ఏడ్పుపై నేను పాట రాశాను. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాకే నల్లగొండలో ఫ్లోరైడ్‌ను రూపుమాపాము. గోదావరి, కృష్ణాలో బ్రహ్మాండంగా నీళ్లు తెచ్చుకునే ప్రయత్నాలు చేశాం. ఒకనాడు ఆముదాలు, బత్తాయి తోటలు మాత్రమే ఉన్న నల్లగొండలో లక్షల టన్నుల వడ్లు పండే పరిస్థితి తెచ్చాం.
>
> – బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

ఎన్నికల తర్వాత తొలి సభకు భారీగా జనం

నల్లగొండ: కృష్ణా జలాల పరిరక్షణకు 'చలో నల్లగొండ' పేరుతో బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన బహిరంగ సభకు జనం భారీగా తరలి వచ్చారు. సభకు ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు మహబూబ్‌నగర్, ఖమ్మం, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచి తరలి వచ్చారు. బీఆర్ఎస్ పార్టీ ఓటమి పాలైన తర్వాత కేసీఆర్ మొదటిసారిగా నిర్వహించిన పోరు సభ కావడంతో పార్టీ ఎమ్మెల్యేలతో పాటు పార్టీ నాయకులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు జన సమీకరణపై దృష్టిపెట్టారు. కేసీఆర్ హెలికాప్టర్‌లో సాయంత్రం 5.10 గంటలకు సభా ప్రాంగణానికి చేరుకున్నారు. హెలికాప్టర్ శబ్దం వినడంతో జనాలంతా లేచి కండువాలు ఊపుతూ జైజై కేసీఆర్ అంటూ నినాదాలు చేశారు. ఆ తర్వాత కేసీఆర్ మాట్లాడుతున్నంతసేపు కొందరు ఈలలు, కేకలు వేస్తుండటంతో వారిని సముదాయించాలంటూ గాదరి కిషోర్‌కుమార్ , రాజేశ్వర్‌రెడ్డిలకు కేసీఆర్ చెప్పారు. కేసీఆర్ కనపడకుండా కొందరు స్టేజీపై అడ్డుగా ఉండటంతో జనం కేకలు వేయగా వారినందరినీ పక్కకు జరిపించారు. పదే పదే మైక్ ఇబ్బంది పెట్టింది. దీంతో మైక్ పెట్టే వ్యక్తిని 'దాన్ని కదిలించకు ఎట్ల ఉందో అట్లనే ఉండనియ్' అని కేసీఆర్ చెప్పారు. కాలు నొప్పి కారణంగా కేసీఆర్ సభలో కూర్చునే మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటం, కృష్ణాజలాల పరిరక్షణపై కేసీఆర్ మాట్లాడుతున్నప్పుడు ప్రజలు హర్షధ్వానాలు చేశారు. దాదాపు 45 నిమిషాల పాటు కేసీఆర్ ప్రసంగం సాగింది.

పెద్దలు కుదిర్చిన పెళ్లే బెటర్

- తల్లిదండ్రులు అన్ని విధాలా ఆలోచిస్తారు
- ప్రేమ పేరుతో తల్లిదండ్రులను మోసం చేయొద్దు
- లైఫ్‌లో సెటిల్ అయ్యాక ప్రేమించి పెద్దలను ఒప్పించి వివాహం చేసుకోవాలి
- 'సాక్షి' డిబేట్‌లో ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల మనోగతం

నేడు ప్రేమికుల దినోత్సవం



సాక్షి డిబేట్‌లో పాల్గొన్న ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు

సాక్షి డిబేట్

సూర్యాపేటటౌన్ : తల్లిదండ్రులకు చెప్పకుండా ప్రేమించి పెళ్లి చేసుకుంటే జీవితంలో ఎన్నో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. మమ్ములను కని పెంచడానికి వారు ఎన్నో కష్టాలు పడ్డారు. మనల్ని ఉన్నత చదువులు చదివిస్తున్నారు. పిల్లలు జీవితంలో ఉన్నతంగా ఎదగాలని వారు ఎన్నో ఆశలు పెట్టుకుంటే మనం ప్రేమ పెళ్లి చేసుకుంటే మోసం చేసినవారమవుతాం పెద్దలు కుదిర్చిన పెళ్లే బెటర్ అని పలువురు విద్యార్థులు అభిప్రాయ పడుతున్నారు. ప్రేమికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రేమ వివాహం- పెద్దలు కుదిర్చిన వివాహం అనే అంశంపై మంగళవారం సాక్షి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులతో నిర్వహించిన డిబేట్‌లో తమ మనోగతాన్ని వెల్లడించారు. పెద్దలు(తల్లిదండ్రులు) కుదిర్చిన పెళ్లి చేసుకుంటే జీవితం సాఫీగా ఉంటుందన్నారు. తల్లిదండ్రులకు తెలియకుండా ప్రేమ వివాహం చేసుకుని చిన్న చిన్న మనస్పర్థలతో విడిపోతున్నారన్నారు. ముందుగా ఉన్నత చదువులు చదివి జీవితంలో సెటిల్ అయ్యాక ప్రేమించి తల్లిదండ్రులను ఒప్పించి చేసుకుంటే వారికి గౌరవం ఇచ్చినవారమవుతామని అంటున్నారు. మరికొందరు విద్యార్థుల అభిప్రాయాలు వారి మాటల్లోనే...

పేరెంట్స్ అన్ని విధాలా ఆలోచిస్తారు



లవ్ చేసి పెళ్లి చేసుకుంటే మధ్యలో మనస్పర్థలు వస్తే జీవితాంతం బాధపడాల్సి వస్తుంది. మన పేరెంట్స్ 20 సంవత్సరాలు పెంచి పోషించి చదివిస్తే ప్రేమ పేరుతో వేరే వాళ్లను పెళ్లి చేసుకొని తల్లిదండ్రులను మోసం చేయడం కరెక్ట్ కాదు. మనకు పెళ్లి చేయాలంటే మన పేరెంట్స్ అన్ని విధాలుగా ఆలోచిస్తారు.

– హారిక

లైఫ్‌లో సెటిల్ అయితే లవ్ మ్యారేజ్ బెటరే



లవ్ చేసే ముందు మనం ఉన్నత శిఖరాలు అధిరోహించాలి. లైఫ్‌లో మంచి చదువు చదివి ఉన్నతమైన జాబ్ చేసి ఆ తర్వాత లవ్ మ్యారేజ్ చేసుకుంటే మంచిదే. కానీ ఆకర్షణ ప్రేమతో అన్ని నష్టాలే. ఇటు తల్లిదండ్రులు జీవితాంతం బాధపడతారు. లైఫ్‌లో సెటిల్ అయ్యాక తల్లిదండ్రులను ఒప్పించి పెళ్లి చేసుకుంటే జీవితం బాగుంటుంది.

– రమ్యశ్రీ

పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసుకోవాలి



ప్రస్తుత సమాజంలో లవ్ అనేది అట్రాక్షన్‌గా మారిపోయింది. తెలిసీ తెలియని వయసులో లవ్‌మ్యారేజ్ చేసుకొని మధ్యలో చిన్న చిన్న మనస్పర్థలతో ఎన్నో జంటలు విడిపోతున్నాయి. తల్లిదండ్రులు కుదిర్చిన పెళ్లి చేసుకున్నాక కూడా ప్రేమించుకోవచ్చు. రెండు మనసులు కలిస్తే జీవితాంతం సుఖంగా ఉండొచ్చు.

– అర్చన

జీవితంలో కష్టనష్టాలు తెలుసుకోవాలి



మన తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తున్నారు. మనం కూడా జీవితంలో కష్టనష్టాలు తెలుసుకోవాలి. అప్పుడే లవ్ చేయాలో వద్దో తెలుస్తుంది. లవ్ పేరుతో మన జీవితాన్ని ఆగం చేసుకోవద్దు. తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలంటే వారు కుదిర్చిన పెళ్లి చేసుకుంటే మంచిది.

– హరిశ్రీ

అరేంజ్డ్ మ్యారేజ్ చేసుకోవాలి



తల్లిదండ్రులకు తెలియకుండా ప్రేమ పెళ్లి చేసుకుంటే జీవితంలో అనేక సమస్యలు వస్తాయి. సమస్యలతో గొడవలు మొదలవుతాయి. అప్పుడు మన తల్లిదండ్రులు కూడా మన దగ్గరకు రారు. జీవితాంతం బాధపడాల్సి వస్తుంది. పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసుకుంటే మంచిది.

– కార్తీక్

తల్లిదండ్రులు కుదిర్చిన పెళ్లయితే రెండు వైపులా సపోర్ట్ ఉంటుంది



మన తల్లిదండ్రులు మనపై ఎన్నో ఆశలతో ఉన్నత చదువులు చదివిపిస్తారు. వారిని అగౌరవపర్చకుండా తల్లిదండ్రులు కుదిర్చిన పెళ్లి చేసుకుంటే జీవితంలో ఎలాంటి ఒడిదొడుగులు వచ్చినా రెండు వైపులా సపోర్ట్ ఉంటుంది. ఒకవేళ నిజాయితీగా ప్రేమిస్తే పెద్దలను ఒప్పించి ప్రేమ పెళ్లి చేసుకుంటే జీవితం సాఫీగా ఉంటుంది.

– కె.కార్తీక్

తల్లిదండ్రులను ఒప్పించి చేసుకుంటే మంచిది



చిన్నప్పటి నుంచి మన గురించి ఆలోచించే మన తల్లిదండ్రులను మోసం చేయకుండా ప్రేమిస్తే వారిని ఒప్పించి చేసుకోవాలి. నిజ మైన లవ్ ఉంటే ప్రేమ పెళ్లి చేసుకుంటే బెటరే. ఒకరినొకరు అర్థం చేసుకొని జీవితంలో ఏదైనా సాధించవచ్చని నా అభిప్రాయం.

– వంశీ

ప్రేమించి పెళ్లి చేసుకుంటే బెటరే



జీవితంలో సెటిల్ అయ్యాక ప్రేమించి పెళ్లి చేసుకుంటే బెటరే. ప్రేమించడం వల్ల ఇద్దరి మధ్య ఎలాంటి దాపరికాలు ఉండవు. పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసుకుంటే ఇద్దరి మనసులు కలవక జీవితంలో మనస్పర్థలు వచ్చే అవకాశం ఉంటుంది.

– కిరణ్

తల్లిదండ్రులకు గౌరవం ఇవ్వాలి



చిన్నప్పటి నుంచి మనల్ని కని పెంచి ఉన్నత చదువులు చదివిస్తున్న తల్లిదండ్రులకు గౌరవం ఇవ్వాలి. వారి ఆశయాలకు తగ్గట్టుగా కష్టపడి చదవాలి. తల్లిదండ్రులు ఏదైనా ఆలోచించే నిర్ణయం తీసుకుంటారు. వాళ్లు చూసిన సంబంధమే పెళ్లి చేసుకుంటే లైఫ్ హ్యాపీగా ఉంటుంది.

– ఉమామహేశ్వరి

మన కుటుంబాన్ని సంతోషపెట్టాలి



ప్రేమ పెళ్లి అయినా, పెద్దలు కుదిర్చిన పెళ్లి అయినా ముందు తల్లిదండ్రులను, మన కుటుంబాన్ని సంతోషపెట్టాలి. మనల్ని కష్టపడి చదివిస్తున్న మన తల్లిదండ్రుల ఆశలను వమ్ము చేయొద్దు. కష్టపడి చదివి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలి. అప్పుడు లవ్ మ్యారేజ్ అయినా, అరేంజ్డ్ మ్యారేజ్ అయినా చేసుకుంటే మన కుటుంబం సంతోషపడుతుంది.

– ఐశ్వర్య

వావ్.. వాలంటైన్ గిఫ్ట్స్

జిల్లా కేంద్రంలోని పలు గిఫ్ట్ ఆర్టికల్స్ దుకాణాల్లో లవ్ సింబల్స్‌తో ఉన్న పలు రకాల బొమ్మలు ప్రేమికులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఇచ్చేందుకు లవర్స్ కొనుగోలు చేస్తున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సూర్యాపేట






ఎన్నికల టీములు నిబద్ధతతో పనిచేయాలి

- అదనపు కలెక్టర్ ప్రియాంక

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ఎన్నికల విధుల్లో పాల్గొనే అన్ని టీములు నిబద్ధతతో పని చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంక సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో యంసీసీ, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీవీటీ, ఫ్లయింగ్ స్క్వాడ్ టీములకు పార్లమెంటు ఎన్నికలపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మద్యం, నగదు రవాణాను అరికట్టేందుకు చెక్‌పోస్టుల వద్ద టీమ్స్ సక్రమంగా పనిచేయాలన్నారు. వివిధ బ్యాంకులకు సంబంధించిన నగదు రవాణా జరిగేటప్పుడు ఆ బ్యాంకుల క్యూఆర్ కోడ్ పరిశీలించి అన్ని ఆధార పత్రాలు ఉన్న వాటిని వెంటనే రిలీజ్ చేయాలన్నారు. ఏ ఆధారం లేకుండా రూ. 50 వేల కంటే ఎక్కువ ఉంటే వెంటనే సీజ్ చేసి గ్రీవెన్స్ కమిటీకి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్స్ రమేష్, చందా శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఎఫ్ఎల్‌సీని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ఎఫ్ఎల్‌సీ పరిశీలన

జిల్లా కలెక్టరేట్‌లోని గోదాంలో కొనసాగుతున్న ఈవీఎంల ఫస్ట్ లెవల్ చెకింగ్ ప్రక్రియను అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంక మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వచ్చే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో 2,590 బ్యాలెట్ యూనిట్స్,1,696 కంట్రోల్ యూనిట్స్, 1,751 వీవీప్యాట్స్ మొదటి లెవల్ చెకింగ్ పూర్తి చేశామన్నారు.

వైష్ణవి మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ఇమాంపేట గురుకుల విద్యార్థిని వైష్ణవి మృతిపై సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ కాలనీలో విద్యార్థిని దగ్గుబాటి వైష్ణవి కుటుంబాన్ని ఐద్వా, ఎస్ఎఫ్ఐ బృందం పరామర్శించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గురుకుల కళాశాలలో వైష్ణవి మృతి చెందిన విషయంలో అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. విద్యార్థిని ఉరేసుకొని చనిపోయిందని తల్లిదండ్రులతో పాఠశాల ప్రిన్సిపల్, హాస్టల్ సిబ్బంది చెబితే మరి ఆమె శరీరంపై గాయాలు ఎలా అయ్యాయని ప్రశ్నించారు. వైష్ణవి చనిపోయాక తల్లిదండ్రులు, పోలీస్‌లు రాకముందే డెడ్ బాడీని ఆస్పత్రికి తీసుకెళ్లడం అనుమానాలకు దారితీస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్ వర్మ, సీసీఎం పట్టణ కార్యదర్శి వల్లపుదాస్ సాయికుమార్, ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు మద్దెల జ్యోతి, కోట సృజన పాల్గొన్నారు.



వైష్ణవి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి



హెలికాప్టర్ దిగి అభివాదం చేస్తూ చలో నల్లగొండ సభకు వస్తున్న కేసీఆర్



సభా వేదిక పైనుంచి అభివాదం చేస్తున్న కేసీఆర్, బీఆర్ఎస్ నాయకులు



స్టేజీపై కూర్చున్న బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు



మాజీ మంత్రి జగదీష్‌రెడ్డితో మాట్లాడుతున్న కేసీఆర్



హైదరాబాద్‌కు హెలికాప్టర్‌లో తిరిగి వెళ్తున్న కేసీఆర్



చేతి కర్ర సహాయంతో మెట్లు దిగుతున్నకేసీఆర్







సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రులు జగదీష్‌రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్



కేసీఆర్‌కి స్వాగతం పలుకుతున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, చాడ కిషన్‌రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి



సభా ప్రాంగణంలో బిల్డింగ్ పైకి ఎక్కి చూస్తున్న ప్రజలు

దొంగతనం కేసులో నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగభూషణం

పెన్‌పహాడ్ : దొంగతనం కేసులో నిందితులను పోలీసులు పట్టుకొని అరెస్టు చేశారు. పెన్‌పహాడ్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టి సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం వివరాలు వెల్లడించారు. పెన్‌పహాడ్ మండలం చీదెళ్ల గ్రామానికి చెందిన వంగవీటి శ్రావణ్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి గత ఏడాది మే నెలలో తీర్థ యాత్రకు వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చే సరికి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగుల గొట్టి బీరువాలోని 75గ్రాముల బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో సోమవారం మాచారం గ్రామశివారు పొట్లపహాడ్ క్రాస్‌రోడ్డు వద్ద పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా బైక్‌పై వెళ్తున్న చీదెళ్ల గ్రామానికి చెందిన గొబ్బి సందీప్, రెడపంగ యశ్వంత్ అనుమానాస్పదంగా కనిపించారు. పోలీసులు వారిని పట్టుకొని విచారించగా గ్రామానికి చెందిన వంగవీటి శ్రావణ్‌కుమార్ ఇంట్లో దొంగిలించిన బంగారు ఆభరణాలను విక్రయించేందుకు సూర్యాపేటకు వెళ్తున్నట్లు ఒప్పుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి బంగారు ఆభరణాలతో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వివరించారు. కేసును త్వరితగతిన ఛేదించిన పోలీసు సిబ్బందికి రివార్డు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో ఆయన వెంట రూరల్ సీఐ అశోక్‌రెడ్డి, ఎస్‌ఐ రవీందర్, సిబ్బంది మచ్చ ప్రవీణ్, లింగయ్య, రవి తదితరులు ఉన్నారు.

ప్రేమతో గెలిచారు !

ప్రేమ..అదో మధురానుభూతి. ఈ భావాన్ని వర్ణించడానికి మాటలు చాలవు. ప్రతి ఒక్కరికీ ఎప్పుడో.. అప్పుడు ఎవరిపైనో మనసులాగేసే ఉంటుంది. ఆ సందర్భంలో మనసులోని వింత అనుభావాలను ఆస్వాధించే ఉంటారు.. 'ప్రేమించడం కన్నా.. ప్రేమించబడడం అదృష్టం' అన్నాడో సినీ కవి. అలా దాన్ని చివరి వరకు నిలుపుకుని భాగస్వామి సంతోషమే తమ సంతోషంగా భావిస్తూ కొన్ని జంటలు ప్రేమించి పెళ్లి చేసుకుని ఆనందంగా జీవితాన్ని సాగిస్తున్నాయి. ప్రేమ..పెళ్లి పీటల వరకు చేరే క్రమంలో ఎన్నో అడ్డంకులు, అవరోధాలు ఎదురైనా ఒక్కటయ్యారు. ప్రేమలో గెలిచి దంపతులుగా అన్యోన్య జీవనం గడుపుతున్న కొన్ని జంటల జీవితాలను ప్రేమికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని 'సాక్షి' పాఠకుల ముందు ఆవిష్కరిస్తోంది.

అడ్డంకులను అధిగమించి..



పిల్లలతో శ్రీకాంత్, సింధూజ దంపతులు

మోత్కూరు : వారిద్దరి మనసులు కలిశాయి. కులా లు అడ్డుగోడలుగా నిలిచినా ప్రేమ వివాహం చేసుకుని సంతోషంగా జీవిస్తున్నారు.. మోత్కూరుకు చెందిన ఎడ్ల శ్రీకాంత్, సముద్రాల సింధూజ దంపతులు. మోత్కూరులో ఫొటోగ్రాఫర్ వృత్తి నేర్చుకుంటున్న శ్రీకాంత్‌కు పట్టణంలోని సముద్రాల వెంకన్న కూతురు సంధ్యతో పదేళ్ల క్రితం పరిచయం ఏర్పడింది. అది కాస్తా కాలక్రమంలో ప్రేమగా మారింది. విషయం రెండు కుటుంబాల పెద్దలకు తెలియడంతో అడ్డంకులు సృష్టించారు. సంధ్యను హైదరాబాద్‌లో బీటెక్ చదివిస్తూ అక్కడే సోదరుడి వద్ద ఉంచారు. శ్రీకాంత్ రెండేళ్ల ఎడబాటు తర్వాత సంధ్యను కలుసుకోవడంతో పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. 2018వ సంవత్సరం ఫిబ్రవరి 15న యాదగిరిగుట్టలో సాంప్రదాయం ప్రకారం వివాహం చేసుకుని, రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వ్యతిరేకించి సంధ్య తల్లిదండ్రులు శ్రీకాంత్‌పై కేసు పెట్టినా కోర్టు ప్రేమజంటకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. దీంతో ఈ దంపతులు మోత్కూరులో ఫొటో స్టూడియో, ఇంటర్నెట్ సెంటర్ నడుపుకుంటూ తమ ఆరేళ్ల కుమారుడు రెహాన్ష్, నాలుగేళ్ల కూతురు శ్రీహన్షతో ఆనందంగా జీవిస్తున్నారు.

తొలి పరిచయంలోనే ఇష్టపడి..



కూతుళ్లతో బాబు, ప్రవీణ దంపతులు

హుజూర్‌నగర్ : రెండు భిన్న కులాలకు చెందిన యువతీ, యువకుడి పరిచయం ప్రేమగా మారింది. పెద్దలు వివాహానికి అంగీకరించకపోడంతో రాజకీయ నాయకుల సహాయంతో రిజిస్టర్ మ్యారేజ్ చేసుకుని సంతోషంగా జీవిస్తున్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని మఠంపల్లి మండలం వర్ధాపురం గ్రామానికి చెందిన బచ్చలకూరి బాబు, శ్రీనివాసపురం గ్రామానికి చెందిన ప్రవీణ 26 ఏళ్ల క్రితం హుజూర్‌నగర్‌లో తొలి పరిచయంలోనే ఒకరిపై ఒకరికి ఇష్టం ఏర్పడింది. అది కాస్తా ప్రేమగా మారింది. ఇద్దరి కులాలు వేరు కావడంతో పెద్దలు వివాహానికి అంగీకరించలేదు. దీంతో స్థానిక సీపీఐ నాయకుడు కేవీరాజు సహాయ సహకారాంతో రిజిస్టర్ మ్యారేజ్ చేసుకున్నారు. వారికి ఇద్దరు పిల్లలు సంతానం. పెద్దమ్మాయి అఖిల అగ్రికల్చర్ బీఎస్సీ పూర్తి చేసింది. గత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా ఎన్నికై ఇటీవల పదవీ కాలాన్ని పూర్తి చేసుకుంది. కాగా చిన్న కూతురు అచ్యుత బీటెక్ పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుంది. ప్రస్తుతం వారి కుటుంబం హుజూర్‌నగర్‌లో నివాసం ఉంటోంది.

ప్రియురాలిని ప్రయోజకురాలిగా చేసి..



కుమారుడితో దేవరపల్లి ప్రవీణ్‌రెడ్డి,భవాని దంపతులు

ఆత్మకూరు(ఎం): ఆత్మకూరు(ఎం) మండలం కప్రాయపల్లికి చెందిన దేవరపల్లి ప్రవీణ్‌రెడ్డి మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని ఆరెగూడేనికి చెందిన బంధువుల అమ్మాయి భవానిరెడ్డితో పరిచయం పెంచుకున్నాడు. అది కాస్తా ఇద్దరిలో ప్రేమను చిగురింపజేసింది. అయితే, నిరుపేద కుటుంబానికి చెందిన భవానీరెడ్డి డిగ్రీ మధ్యలో చదువు మానేసే పరిస్థితులు ఏర్పడ్డాయి. విషయం తెలుసుకున్న ప్రవీణ్‌రెడ్డి ప్రియురాలిని పీజీ వరకు చదివించాడు. ఆ వెంటనే ఆమెకు వీఆర్వో ఉద్యోగం వచ్చింది. అయినా.. ఆమెను ప్రోత్సహించడంతో 2019లో ఎస్‌ఐ ఉద్యోగం సాధించింది. ఆ తర్వాత 2021లో పెద్దల అంగీకారంతో వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని కమిషనరేట్‌లో భవానీరెడ్డి ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రవీణ్‌రెడ్డి కూడా హైదరాబాద్‌లో ఎల్‌ఎల్‌బీ ప్రాక్టీస్ చేస్తున్నారు. తొమ్మిది నెలల బాబుతో సంతోషంగా జీవిస్తున్నారు.

ప్రేమిస్తే టీసీ ఇచ్చి పంపించారు..



జెడ్పీటీసీ కోట పుష్పలత మల్లారెడ్డి

భూదాన్‌పోచంపల్లి : తెలిసీ తెలియని వయస్సులో మైనర్‌ను ప్రేమించాడు. బాలికకు సైతం అతనంటే ఇష్టమే. కానీ తల్లిదండ్రులకు విషయం తెలిస్తే ఏమి అవుతుందోనని భయం. చివరకు ఈ విషయం తెలిసి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అబ్బాయికి టీసీ ఇచ్చి పంపించారు. అయినా పట్టువిడవకుండా అమ్మా యి తల్లిదండ్రులను ఒప్పించి పెళ్లిచేసుకోవడానికి నాలుగేళ్లు పట్టింది. చివరకు ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకొని 38 ఏళ్లుగా అన్యోన్య జీవనం సాగిస్తున్న భూదాన్ పోచంపల్లి జెడ్పీటీసీ కోట పుష్పలత మల్లారెడ్డి ప్రేమపెళ్లి గాథ ఇది. భూదాన్‌పోచంపల్లి మండలం కనుముకుల గ్రామానికి చెందిన కోట మల్లారెడ్డి పోచంపల్లి జెడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతుండగా ఇదే స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న సామల పుష్పలతను ప్రేమించాడు. ఈ విషయం పుష్పలత తల్లిదండ్రులు, ఇటు స్కూల్‌లో ఉపాధ్యాయులకు తెలిసి రచ్చ అయ్యింది. దాంతో మల్లారెడ్డికి ప్రధానోపాధ్యాయుడు టీసీ ఇచ్చి పంపించారు. పెళ్లి చేసుకోవడానికి ఆస్తులు, అంతస్తులు అడ్డు వచ్చి పుష్పలత తల్లిదండ్రులు పెళ్లికి అంగీకరించలేదు. ఇంటర్ పూర్తి చేసిన నాలుగేళ్ల తర్వాత అమ్మాయి తల్లిదండ్రులను ఒప్పించి 1989 మే 10న పెళ్లి చేసుకొన్నాడు. ప్రస్తుతం వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. పుష్పలత ప్రస్తుతం పోచంపల్లి మండల జెడ్పీటీసీగా ఉన్నారు. కాగా కోట మల్లారెడ్డి ప్రతి ఏటా ఫిబ్రవరి 14 ప్రేమికుల దినోత్సవం రోజున తన సతీమణికి గిఫ్ట్ ఇస్తూ ప్రేమను చాటుతున్నారు.

పెద్దలను ఒప్పించి వివాహం చేసుకున్నారు



మురళీధర్‌రెడ్డి, పుష్పలత ఫ్యామిలీ

రామగిరి (నల్లగొండ): మిర్యాలగూడకు చెందిన తుమ్మలూరి మురళీధర్ రెడ్డి హాలియాకు చెందిన పుష్పలత ఇద్దరు బంధువులు. అయినా మొదట్లో వీరికి పరిచయం లేదు. బంధువుల వివాహంలో పుష్పలత తొలిసారిగా మురళీధర్ రెడ్డిని చూసింది. ఆ తర్వాత మురళీధర్ రెడ్డి అడ్రస్ తెలుసుకొని ఉత్తరాలే రాసేది. అవి చూసి తను తెలిసీతెలియక రాస్తుందేమో అనుకునేవాడు. అలా చాలా సార్లు లెటర్లు రాస్తూనే ఉండేది. అప్పుడు మురళీధర్‌రెడ్డికి అనిపించింది..ఆమె నన్ను నిజంగా ప్రేమిస్తుందని. అప్పటికీ వారి చదువు పూర్తి కాలేదు. ఇంట్లో వాళ్లకు విషయం తెలిసింది. కానీ వారు ఒప్పుకోలేదు. ఆ తర్వాత వారిని ఒప్పించి వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం మురళీధర్ రెడ్డి నల్లగొండలో కంప్యూటర్ హార్డ్‌వేర్‌గా స్థిరపడగా, పుష్పలత హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తుంది. వీరికి ఇద్దరు కుమారులు. అశుతోష్ రెడ్డి ఎంఎస్ పూర్తి చేసి అమెరికాలో స్థిరపడగా, అమిత్ రెడ్డి డిఫెన్స్ అకాడమీలో పైలెట్‌గా పనిచేస్తున్నాడు.

ఒకే ఇంట్లో మూడు ప్రేమ వివాహాలు



కుమారులు, కోడళ్లతో పాపయ్య, వెంకట్రావమ్మ దంపతులు

కోదాడ: తల్లిదండ్రులు కులాలకు అతీతంగా ప్రేమ వివాహం చేసుకోగా.. వారి బాటలోనే వారి ఇద్దరు కుమారులు కూడా ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. కోదాడ మండల పరిధిలోని కొమరబండకు చెందిన దివ్యాంగుడు కందుల పాపయ్య అదే గ్రామానికి చెందిన వెంకట్రావమ్మను 1980వ సంవత్సరంలో ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరి పెద్ద కుమారుడు కందుల మధు ఉస్మానియా యూనివర్సిటీలో చదువుతూ తన క్లాస్‌మేట్ విజయలక్ష్మిని 2010లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. పాపయ్య చిన్న కుమారుడు కందుల విక్రమ్ కూడా సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ 2014లో తన తోటి ఉద్యోగి ఉషను ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఇలా ఒకే ఇంట్లో ముగ్గురు ప్రేమ వివాహాలు చేసుకొని పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఖండాలు దాటి.. ఇంగ్లండ్‌లో చిగురించిన ప్రేమ



లంకెల బాలకృష్ణారెడ్డి- నీనశ్రీ

కోదాడ: ఇండియాలో పుట్టిన వారు ఉన్నత చదువుల కోసం ఇంగ్లండ్‌కు వెళ్లారు. అక్కడి యూనివర్సిటీలో కలిసిన మనస్సులు కులమతాలకు అతీతంగా వారిని ఒకటి చేశాయి. ఒకరి అభిప్రాయాలు మరొకరి నచ్చడంతో వారిమధ్య చిగురించిన ప్రేమ పెళ్లిపీటల వరకు తీసుకెళ్లింది. ప్రస్తుతం వారు ఇద్దరు పిల్లలతో అక్కడే నివాసముంటున్నారు. ప్రేమించడం కన్నా ఆ ప్రేమను నిలుపుకోవడం ముఖ్యమంటున్నారు లంకెల బాలకృష్ణారెడ్డి- నీనశ్రీ దంపతులు. కోదాడకు చెందిన లంకెల బాలకృష్ణారెడ్డి 2007లో ఎంఎస్ చదవడానికి యూనివర్సిటీ ఆఫ్ ఈస్ట్ లండన్‌కు వెళ్లాడు. ఎంఎస్ కోసం అదే యూనివర్సిటీలో హైదరాబాద్‌కు చెందిన నీనశ్రీ కూడా చేరారు. ఇద్దరు కులాలు వేరైనా అభిప్రాయాలు కలవడంతో వారి మధ్య చిగురించిన ప్రేమ పెళ్లి వరకు వచ్చింది. ఇండియాలో ఉన్న పెద్దలను ఒప్పించి వారి సమక్షంలోనే పెళ్లి చేసుకున్నారు. ప్రస్తుతం వీరికి ఇద్దరు పిల్లలు. ఇద్దరు ఇంగ్లండ్ వారసత్వాన్ని పొందారు. ప్రేమికుల రోజు సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రేమించడం.. ప్రేమించబడడం అదృష్టమని దాన్ని చివరి వరకు నిలుపుకొని భాగస్వామి సంతోషాన్నే తమ సంతోషంగా ఇరువురు భావించినపుడే ఆ బంధం పదికాలాలపాటు పదిలంగా ఉంటుందని చెప్పారు.

పాత కక్షలతో హత్యాయత్నం

- కల్లుగీసే కత్తితో ఒకరిపై దాడి.. పరిస్థితి విషమం

ఆత్మకూర్(ఎస్)(సూర్యాపేట) : పాతకక్షలను దృష్టిలో పెట్టుకొని కల్లుగీసే కత్తితో వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ (ఎస్) మండల పరిధిలోని తుమ్మలపెన్‌పహాడ్ గ్రామంలో చోటుచేసుకుంది. తుమ్మలపెన్‌పహాడ్ గ్రామానికి చెందిన కాట్ల సందీప్, యరగాని లింగయ్యల మధ్య పాతకక్షలు ఉన్నాయి. వీరి కుటుంబాల మధ్య పెద్ద మనిషుల సమక్షంలోనూ పంచాయితీలు నిర్వహించారు. కాగా మంగళవారం సాయంత్రం కాట్ల సందీప్ తాటిచెట్టు ఎక్కి వస్తుండగా యరగాని లింగయ్య కల్లుగీసే కత్తితో ఒక్కసారిగా దాడి చేశాడు. దీంతో సందీప్ తల, మెడ, వీపు భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు క్షతగాత్రుడిని తొలుత సూర్యాపేట ఆస్పత్రికి తరలించాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడినుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. సందీప్ సోదరుడు కాట్ల లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ సైదులు తెలిపారు.

విద్యుదాఘాతంతో దుర్మరణం

మునగాల : విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మునగాల మండలంలోని రేపాలలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ బైరెడ్డి అంజిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రేపాల గ్రామానికి చెందిన రావు పెదరామిరెడ్డి(48) తన ఇంటి ఎదురుగా ఉన్న రాపోలు మణెమ్మ ఇంట్లో విద్యుత్ మోటారు మరమ్మతు చేసేందుకు వెళ్లాడు. మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై పెద రామిరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మంటలంటుకుని గాయపడిన వ్యక్తి మృతి

వలిగొండ : ప్రమాదవశాత్తు మంటలంటుకుని గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. వలిగొండ మండలం మొగిలిపాకకు చెందిన పబ్బు ఐలయ్య (48) ఈ నెల 6న ఇంట్లో ఛాయ్ చేసుకునేందుకు గ్యాస్ స్టౌవ్ వెలిగించాడు. ఈ క్రమంలో గ్యాస్ లీకై వ్యాపించిన మంటలు ఐలయ్యకు అంటుకోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. మంగళవారం మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహేందర్ లాల్ తెలిపారు. మృతుడి కుటుంబాన్ని మంగళవారం బీఆర్ఎస్ నాయకులు ముద్దసాని కిరణ్ రెడ్డి పరామర్శించి రూ.15వేల ఆర్థికసాయం అందజేశారు.

తంబాకు ఇవ్వలేదని చంపేశాడు !

- హత్య కేసులో నిందితుడిపై రుజువైన నేరారోపణ
- జీవిత ఖైదు విధిస్తూ న్యాయమూర్తి తీర్పు

మిర్యాలగూడ టౌన్ : తంబాకు (ఖైనీ) ఇవ్వలేదన్న కారణంతో ఒకరిని దారుణంగా హత్య చేశాడన్న నేరారోపణ నిందితుడిపై రుజువు కావడంతో జీవిత ఖైదుతో పాటు జరిమానా విధిస్తూ నల్లగొండ జిల్లా మిర్యాలగూడ ఐదవ అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి జి.వేణు మంగళవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కేసు వివరాలు ఇలా.. జార్ఖండ్, బిహార్ రాష్ట్రాలకు చెందిన రఘునంధన్‌రామ్(42), ఓం ప్రకాశ్ గుప్తాలు నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామ శివారులోని యాదాద్రి పవర్ ప్లాంట్‌లో కూలీలుగా పనిచేస్తున్నారు. 2023 ఏప్రిల్ 25న గ్రామ శివారులోని బెల్టుషాపులో మద్యం తాగే క్రమంలో ఇద్దరికి పరిచయం ఏర్పడింది. అక్కడే సాయంత్రం వరకు మద్యం తాగిన రఘునందన్ రామ్, ఓం ప్రకాశ్‌గుప్తాలు రాత్రి ఆ మత్తులోనే పవర్ ప్లాంట్‌లోని ఓ చెట్టు కింద పడుకున్నారు. అర్ధరాత్రి సమయంలో రఘునందన్‌రామ్ మేలకువ రావడంతో తన జేబులో ఉన్న తంబాకు (ఖైనీ) నోట్లో వేసుకుంటున్నాడు. ఈ క్రమంలో నిద్ర లేచిన ఓం ప్రకాశ్ గుప్తా తనకు కూడా తంబాకు ఇవ్వమని కోరడంతో రఘునందన్‌రామ్ నిరాకరించాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఆగ్రహానికి లోనైన ఓం ప్రకాశ్ గుప్తా అక్కడి నుంచి వెళ్లిపోతున్న రఘునందన్ రామ్‌ను వెనుకనుంచి రాయితో కొట్టడంతో కుప్పకూలి మృతిచెందాడు. మరుసటి రోజు డక్కన్ కంపెనీ మేనేజర్ బండారు రంగనాథ్ ఈ ఘటనపై వాడపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి సీఐ ముత్తినేని సత్యనారాయణ కేసు దర్యాప్తు చేశారు. నిందితుడు ఓం ప్రకాశ్ గుప్తాను కోర్టులో హాజరుపరిచి, చార్జిషీట్‌ను కోర్టులో దాఖలు చేశారు. 12మందిని విచారించిన తర్వాత నిందితుడిపై నేరం రుజువుకావడంతో జీవిత ఖైదుతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరు నెలల పాటు సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మన్నెం మనోహర్ రెడ్డి వాదించగా వాడపల్లి కోర్టు కానిస్టేబుల్ యూనుస్, లైజన్ ఆఫీసర్ సైదులు సహకరించారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

మాడుగులపల్లి : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం చెందారు. వివరాలు ఇలా.. మాడుగులపల్లి మండలం కొత్తగూడేనికి చెందిన సింగం అంజయ్య(60) మంగళవారం కిరాణాషాపునకు వెళ్లేందుకు రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో మిర్యాలగూడ నుంచి బైక్‌పై తిప్పర్తి వెళ్తున్న గుర్తుతెలియని వ్యక్తి నేరుగా ఢీకొట్టాడు. ప్రమాదంలో గాయపడిన అంజయ్య అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. బైక్ నడుపుతున్న వ్యక్తి గాయాలతోనే సంఘటనా స్థలం నుంచి పరారయ్యాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నల్లగొండ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడున్నారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ నరేశ్‌కుమార్ తెలిపారు.

కారు ఢీకొని రైతు..

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలం అంతయ్యగూడేనికి చెందిన సిరిగిరి వెంకట్‌రెడ్డి(40) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం వెంకట్‌రెడ్డి అనిశెట్టిదుప్పలపల్లి వద్ద ఉన్న తన వ్యవసాయ భూమి వద్దకు బైక్‌పై వెళ్లాడు. అక్కడ పనులు ముగించుకుని సాయంత్రం స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. అనిశెట్టిదుప్పలపల్లిలోని ఓ ఫంక్షన్‌హాల్ సమీపంలో రోడ్డు దాటుతుండగా తిప్పర్తి వైపు వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన వెంకట్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి కొడుకు, కుమార్తె ఉన్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

బైక్‌ను కారు ఢీకొట్టడంతో..

తిరుమలగిరి (తుంగతుర్తి) : మున్సిపాలిటీ పరిధిలోని తిరుమలహిల్స్‌కు చెందిన జోగు సురేష్ అలియాస్ ప్రసాద్ (42) బీసీబాలుర వసతిగృహంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. సురేష్ మంగళవారం హాస్టల్‌లో పనులు ముగించుకొని బైక్‌పై ఇంటికి వస్తున్నాడు. స్థానిక ఓ ఫంక్షన్ హాల్ వద్ద వాహనాన్ని యూ టర్న్ తీసుకుంటుండగా సూర్యాపేట నుంచి తిరుమలగిరి వైపు వస్తున్న కారు ఢీకొట్టింది. గాయపడిన సురేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తుంగతుర్తి ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.